‘ఉపాధి’కి సిబ్బంది కొరత

- 20 గ్రామ పంచాయతీలకు ఎనిమిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు
- అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్న వైనం

సుజాతనగర్: గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు, వలసలు తగ్గిస్తూ కూలీలకు ఆర్థికంగా చేయూతనందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. కానీ గత ప్రభుత్వం నూతనంగా మండలాలు, గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి నూతన మండలాలకు కూడా ఉమ్మడిగా ఉన్న గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లను పెట్టి ఉపాధి హామీ పథకాన్ని నెట్టుకొస్తున్నారు. అయితే నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో కూలీల సంఖ్యకు అనుగుణంగా ఫీల్డ్ అసిస్టెంట్లు లేక కూలీల సంఖ్య తగ్గుతోంది.

ఐదుగురే ఫీల్డ్ అసిస్టెంట్లు..

సుజాతనగర్ మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా.. సుజాతనగర్, నాయకులగూడెం, నర్సింహసాగర్, మంగపేట, కోమటిపల్లి, లక్ష్మీదేవిపల్లి, నిమ్మలగూడెం గ్రామ పంచాయతీల్లో కొత్తగూడెం కార్పొరేషన్‌లో విలీనం అయ్యాయి. కార్పొరేషన్‌లో విలీనం అయిన గ్రామ పంచాయతీల్లో 15 రోజులుగా ఉపాధి పనులు నిలిచిపోయాయి. ఈ ఏడు గ్రామ పంచాయతీల్లో 8,701 మంది కూలీలకు ఉపాధి లేకుండా పోయింది. మిగిలిన 13 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు కొనసాగుతుండగా సిబ్బంది కొరత నెలకొంది. ప్రస్తుతం మండలంలో ఎనిమిది మంది మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్‌కు రెండు నుంచి మూడు గ్రామాల బాధ్యతలను అప్పగించారు. వీరంతా రోజు వారీగా ఉపాధి కూలీలకు పని కల్పించడం, మస్టర్లు తీయడం, పనులను అప్పగించడం, జాబ్ కార్డులను మంజూరు చేయడం, ఆధార్ అనుసంధానం, కూలీలకు వసతులు, పనుల తర్వాత ఫొటో తీయడం వంటి పనులు నిర్వహిస్తారు. ఇలా అన్ని పనులను ఫీల్డ్ అసిస్టెంట్లు చూసుకోవడం ఇబ్బందిగా మారింది.


నర్సింహసాగర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

టెక్నికల్ అసిస్టెంట్ల కొరత..

ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రస్తుతం ఫీడర్ చానల్, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, కందకాలు, మట్టి రోడ్ల నిర్మాణం తదితర పనులను చేపడుతున్నారు. కూలీలకు పనులు చూయించడం, పనులను పర్యవేక్షించడం వంటి పనులు ఫీల్డ్ అసిస్టెంట్లు చేస్తే, కూలీలు చేసిన పనిని కొలతలు తీసుకొని వారికి వేతనం ఇప్పించడంలో టెక్నికల్ అసిస్టెంట్లు కీలక పాత్ర పోషిస్తారు. ఇలాంటి టెక్నికల్ అసిస్టెంట్లు మండలంలో మొత్తం ఐదుగురు మాత్రమే ఉన్నారు. వారితోనే ఉపాధి పనులను నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్లను, టెక్నికల్ అసిస్టెంట్లను నియమించాలని కూలీలు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి...



నూతనంగా ఏర్పడిన పంచాయతీలకు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి. ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ మూడు లేదా నాలుగు పంచాయతీలకు బాధ్యతలు అప్పగించారు. దీంతో కూలీలకు సరైన న్యాయం చేయలేకపోతున్నారు.

– కాత్రాల తిరుపతిరావు, సుజాతనగర్

సిబ్బంది కొరత ఉంది...



ప్రస్తుతం 13 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు సాగుతున్నాయి. ఎనిమిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండటంతో ఉపాధి కూలీలకు పని కల్పించడం, పనుల పర్యవేక్షణ ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిజేయస్తాం.

– బి.బారతి, ఎంపీడీఓ, సుజాతనగర్

ప్రజాసేవలో ముందుండాలి

ఇల్లెందు: ఆర్యవైశ్యులు విద్య, వైద్యం వ్యాపార రాజకీయ రంగాల్లో ముందుండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు ధారా రమేష్ కోరారు. ఆదివారం ఇల్లెందు ఆర్యవైశ్య మండల మహాసభ ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీ సత్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా సత్రం కోసం స్థల సేకరణ చేశామన్నారు. ప్రతీ మండలంలో పేదలకు ఉచితంగా పది సభ్యత్వాలు అందజేస్తున్నామని తెలిపారు. త్వరలో కొత్తగూడెంలో వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. పేద ఆర్యవైశ్యులకు గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం అమలు చేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ ఆర్యవైశ్య హాస్టల్‌లో పేద విద్యార్థులకు ఉచిత వసతి కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఝెలుగూరి నగేష్‌కుమార్, తాతా శ్రీనివాసరావు, ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, ఆర్వపల్లి రాధాకృష్ణమూర్తి, నరేంద్రుల అను, కె.కోటేశ్వరరావు, చంద్రశేఖర్, పి.కిషోర్, ధీరజ్, అమర్‌గుప్తా, సాయి కుమార్, గొరిశెట్టి పురుషోత్తం, చందా భద్రం, వాసు, బాలకృష్ణ, సుబ్బారావు, శంకర్ పాల్గొన్నారు.


రమేష్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

ఆకతాయిల ఆటకట్టించండి..

పాల్వంచ: బాలికల వసతి గృహాల వద్ద ఇటీవల కాలంలో కొందరు ఆకతాయిలు అదేపనిగా తిరుగుతున్నారని సమాచారం. బాలికల వసతి గృహాలను టార్గెట్ చేసుకుని అమ్మాయిలను ఇబ్బంది పెట్టే విధంగా తిరగడం, ఆయా వసతి గృహాల సమీపంలో డబ్బా కొట్లు, షాపుల వద్ద గంటల తరబడి బైఠాయించడం చేస్తున్నారు. వారిని ఆకర్షించేందుకు వెకిలి చేష్టలకు పాల్పడుతున్నారు. వారు ఏదైనా పనిమీద బయటకు వస్తే వెంటనే వారిని అనుసరిస్తుండడంతో బాలికలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు వాపోతున్నారు. బీసీఎం రోడ్‌లోని వసతిగృహాలు, బొల్లేరుగూడెం రోడ్డులో వసతి గృహం, శాస్త్రీ రోడ్‌లోని ఓ కళాశాలకు చెందిన ప్రైవేట్ వసతి గృహ, నవభారత్ వద్ద పాఠశాల, కళాశాలల వద్ద ఇటీవల కొంతమంది కుర్రాళ్లు బైక్‌లపై తరచు తిరగడం, పెద్దపెద్ద హారన్‌లతో బైక్‌లపై రౌండ్లు వేయడం చేస్తున్నారు.

అంతేగాక ఆయా వసతిగృహాల సమీపంలో పలు షాపుల వద్ద గంటల తరబడి కూర్చోవడం, అటుగా వెళ్లే అమ్మాయిలను అదేపనిగా చూస్తూ ఇబ్బందికి గురి చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఎక్కడి నుంచో చదువుకునేందుకు వచ్చే అమ్మాయిలు ఈ పోకిరీలతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి


మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు కె.సారయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఇల్లెందులో 4, 5వ వార్డుల్లో జరిగిన శాఖ మహాసభల్లో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓడినా.. గెలిచినా ఎర్రజెండా ప్రజల పక్షానే ఉంటుందన్నారు. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా సీపీఐగా పని చేస్తుందని చెప్పారు. శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని, దున్నేవాడికే భూమి ఉండాలని, దోపిడీ లేని సమాజం నిర్మాణం చేయాలని సీపీఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయ జోక్యం నివారించాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని విన్నవించారు.

అనంతరం 4, 5వ వార్డు కార్యదర్శిగా కొత్త రాజయ్య, సహాయ కార్యదర్శిగా సారయ్య, వెంకటస్వామిలను ఎన్నిక చేశారు. ఈ సమావేశంలో దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, సదానందం, మన్నాన్, గట్టయ్య, సరిత, మమత, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఇంకుడుగుంత నిర్మాణం ఇలానా..!

వర్షపు నీటిని ఒడిసిపట్టి ఇంకుడుగుంత ద్వారా నీటిని రీచార్జ్ చేసేందుకు ఉద్దేశించిన ఇంకుడుగుంత ఇంకని గుంటగా మారింది. జిల్లా వ్యాపితంగా ఇంకుడుగుంతల నిర్మాణాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతీ ఇంట్లో, విద్యా సంస్థల్లో ఇంకుడుగుంతల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే వర్షాకాలంలో వరద నీరు రోడ్డుపై నిలిచి రోడ్లు దెబ్బతినడం, రాకపోకలకు ఇబ్బందిగా లేకుండా, రోడ్డుపై వరద నీరు నిల్వ ఉండొద్దని, ఆ నీటిని వినియోగంలోకి తేవాలనే ఉద్దేశంతో రహదారుల వెంబడి కూడా ఇంకుడుగుంతలు తవ్వారు. టేకులపల్లి సెంటర్‌లో రోడ్డు పక్కనే ఇంకుడుగుంతను తవ్వారు. రోడ్డుపై నిల్వ ఉన్న వరద నీరు ఇంకుడుగుంతలోకి వెళ్లే విధంగా గుంతను తవ్వాల్సి ఉండగా రోడ్డు కంటే ఇంకుడు గుంత ఎత్తులో ఉంది. దీంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. - టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి: ఉప్పు దీప్తి
టేకులపల్లి పంచాయితీ కార్యదర్శి
సెల్ నంబర్ : 9640766281

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఇల్లెందు: కార్మిక చట్టాలను సవరించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జరగనున్న నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఇఫ్టూ కోరింది. ఆదివారం ఇల్లెందులో ఎన్డీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇఫ్టూ నేతలు సారంగపాణి, సీఐటీయూ జిల్లా నాయకులు నబీ, ఐఎన్‌టీయూసీ నేత వెంకటనారాయణ, టీయూసీఐ నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు, టీబీజీకేఎస్ నేత జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ... 20న ఇల్లెందులో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, అవుట్ సోర్సింగ్ కార్మికులు అత్యధికంగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాస్, తాళ్లూరి కృష్ణ, ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ఆర్థిక సాయం

జూలూరుపాడు: అనంతారం గ్రామానికి చెందిన బాగెబోయిన సాయమ్మ, కుంజా అలివేలు, వనమాల నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కొర్సా రమేష్, ఉసికల వెంకటేశ్వర్లు, మల్కం వీరభద్రం, బండారు పుల్లారావు, నరేష్ తదితరులు పరామర్శించి, ఓదార్చారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ 5,000 చొప్పున మూడు కుటుంబాలకు రూ.15,000 అందజేశారు.

సింగరేణిలో రాత పరీక్ష ప్రశాంతం


పర్యవేక్షిస్తున్న జీఎం నికోలస్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ–35 పోస్టులకు జరిగిన రాత పరీక్షకు 115 మందికి 102 మంది హాజరయ్యారు. జూనియర్ ఆఫీసర్(ఎకౌంట్స్) ఈ–గ్రేడ్–1, 2 పరీక్షకు ఇద్దరు హాజరయ్యారు. ఈ పరీక్ష సెంటర్లను సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం నికోలస్ పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ.. ఫలితాలు ఈ రోజు రాత్రి కొత్తగూడెంలోని హెడ్డాఫీస్ ప్రధాన గేట్ సమీపంలోని నోటీసు బోర్డులో, సింగరేణి వెబ్‌సైట్‌లో పెడతామని పేర్కొన్నారు.

ఇల్లెందులో ఏడుగురు పోలీసుల బదిలీ

ఇల్లెందు: ఇల్లెందు పోలీస్ స్టేషన్ నుంచి ఏడుగురు పోలీలు బదిలీ అయ్యారు. హెడ్‌కానిస్టేబుల్స్ లక్ష్మారెడ్డి చుంచుపల్లికి, కృష్ణయ్య కొత్తగూడెం త్రీ టౌన్‌కు కానిస్టేబుళ్లు రాంబాబు, కిరణ్‌కుమార్, కళ్యాణి త్రీ టౌన్‌కు, మురళీ సుజాతనగర్‌కు, స్వాతి లక్ష్మీదేవిపల్లికి బదిలీ అయ్యారు. వారి స్థానంలో నియామకం అయిన వారు ఒకటి రెండు రోజుల్లో రిపోర్టు చేయనున్నారు.

‘గూడెం’లో తిరంగా ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

చుంచుపల్లి/సింగరేణి(కొత్తగూడెం): పాకిస్తాన్ ముష్కరులను మట్టుబెట్టేందుకు త్రివిధ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా కొత్తగూడెంలో సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఫోరమ్ ఆధ్వర్యంలో ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి కొత్తగూడెం రైల్వేస్టేషన్ వరకు యువత, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖులు జాతీయ జెండాలు చేతబూని భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్‌మాతాకీ జై.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. భారతదేశం ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్‌కు తగిన బుద్ధిని చెప్పిందని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత త్రివిధ దళాలు వ్యవహరించిన తీరు భారతదేశం పౌరులందరికీ గర్వకారణం అన్నారు. భారత ప్రధాని ప్రణాళికలతో రక్షణ దళాలు పాకిస్తాన్‌ను కోలుకోకుండా చేశాయన్నారు. పాకిస్తాన్‌లోనే వారి స్థావరాలను మన ఆర్మీ ధ్వంసం చేసి ప్రపంచదేశాలకు తన సత్తా ఏమిటో తెలియజేసిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ఆర్మీ జవాన్లు పోరాడిన తీరు ఎన్నటికీ మర్చిపోలేనిదని, యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రంగాకిరణ్, విద్యాసాగర్, పూర్ణ పాల్గొన్నారు.

ఉన్నత విద్య కోసం ‘స్టేటస్ సర్టిఫికెట్’ పొందాలి

కొత్తగూడెంఅర్బన్: నీట్, జేఈఈ కౌన్సెలింగ్‌కు హాజరు కానున్న మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు మైనారిటీ స్టేటస్ సర్టిఫికేట్ కొరకు స్థానిక ఈ–సేవ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకొని పొందాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో, జేఈఈ మెయిన్ ద్వారా ఐఐటీలో, ఎన్ఐటీలలో, ఎప్‌సెట్ ద్వారా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీలలో ప్రవేశాల కొరకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో మైనారిటీ స్టేటస్ సర్టిఫికేట్ సమర్పించవలసి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో ఈ సర్టిఫికేట్లను వారు చదివిన పాఠశాలల నుంచి పొందేవారని, రెవెన్యూ శాఖవారు గతంలో విడుదల చేసిన జీఓ ప్రకారం విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం నుంచే మైనారిటీ స్టేటస్ సర్టిఫికేట్ పొందాలని, ఇందుకు గాను రెవెన్యూ శాఖ విడుదల చేసిన దరఖాస్తు ఫారంతో పాటు ఓసీ, బీసీ–సీ, బీసీ–ఈ, బీసీ– బీ కుల సర్టిఫికేట్, 10వ తరగతి టీసీ, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నీట్, జేఈఈ, ఎప్‌సెట్ –2025, ర్యాంక్ కార్డుతో ఈ–సేవ సెంటర్‌లో సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, జోరాస్ట్రియన్లు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

పాల్వంచ: శివరాత్రి రోజు శివలింగంపై నేరుగా సూర్యకిరణాలు పడే రాష్ట్రంలోని ఏకైక దేవాలయం పాల్వంచలోని శ్రీ ఆత్మలింగేశ్వరాలయం. 13వ శతాబ్దంలో కాకతీయుల రాజు శ్రీ ప్రతాప రుద్ర మహారాజ కాలంలో ఈ దేవాలయాన్ని నిర్మించారు. పాల్వంచ సంస్థాన వ్యవస్థాపకాధీశులైన శ్రీ అన్నప్ప అశ్వరాయ నేతృత్వంలో దూప, దీప, నైవేద్యం పూజా కార్యాక్రమాలను నిర్వహించినట్లు చరిత్ర చెబుతుంది. కాగా కాలక్రమేణ నిరాధారణకు గురైన ఈ ఆలయాన్ని పాల్వంచకు చెందిన ప్రముఖులు మచ్చా శ్రీనివాసరావు 2002లో గుర్తించి ఆలయ అభివృద్ధికి పూనుకున్నారు. ఈక్రమంలో స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠా మహాకుంభాభిషేక మహోత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం కాకతీయ వారసుల సమక్షంలో ఆత్మలింగేశ్వర విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కాకతీయ వారసులు కమల్‌చంద్ బంజ్‌దేవ్, శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ, దామెర కుమార మురళీ మహిపాల్ హాజరుకానున్నారు.


పాల్వంచలోని ఆత్మలింగేశ్వరాలయం

పారిశుద్ధ్యం అధ్వానం

- బాపూజీనగర్‌లో పేరుకుపోయిన చెత్త కుప్పలు
- పలుచోట్ల దెబ్బతిన్న డ్రెయినేజీ వ్యవస్థ
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు

పాల్వంచ: మున్సిపాలిటీలో ఇటీవల కాలంలో పారిశుద్ధ్య పనులు మందగించాయి. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, మట్టి కుప్పలు, డ్రెయినేజీలో పేరుకపోయిన చెత్తచెదారమే దర్శనమిస్తోంది. ఇంటింటికీ చెత్త సేకరణ చేసే సిబ్బంది సకాలంలో రాకపోవడంతో ఇళ్లలో చెత్తను పెట్టుకోలేక పట్టణ వాసులు రోడ్లపై ఉక్కడపడితే అక్కడే పడేస్తున్నారు. ఈ క్రమంలో భారీ ఎత్తున చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. అయినా మున్సిపాలిటీ సిబ్బంది కన్నెత్తి చూడటం లేదు. ముఖ్యంగా బాపూజీనగర్ పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఈ కాలనీలో ఎక్కువ విస్తీర్ణంలో ఉండటంతో పాటు జాతీయ రహదారి పక్కనే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దంపింగ్‌ను తలపిస్తున్న చెత్తకుప్పలు..

బాపూజీనగర్‌లో పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా చేపట్టక పోవడంతో రోడ్ల పక్కనే చెత్తకుప్పలు పేరుకుపోయిన డంపింగ్ యార్డ్‌లను తలపిస్తున్నాయి. సినిమా హాల్ వెనుక బజార్, మసీద్ పక్కరోడ్డు, కింద చెరువు బజార్ వరకు పలు ఏరియాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా భారీ ఎత్తున చెత్తకుప్పలే ఉన్నాయి. ఇక ఈ ఏరియాలో పాత ఇనుప కొట్లు చాలా ఉన్నాయి. ఈ కొట్టుకు వచ్చే పాత సామాన్లు సైతం పలుచోట్ల రోడ్లపైనే పడేయడం, లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండటంతో బాటసారులకు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కేటీపీఎస్ క్వార్టర్స్ నుంచి పలువురు చెత్తను రోడ్డుపై వేస్తున్నారని వాపోతున్నారు.



ఆల్ కౌసర్ స్కూల్ రోడ్‌లో చెత్త (ఇన్‌సెట్) దెబ్బతిన్న డ్రెయినేజీ

వర్షం వస్తే రోడ్డెక్కుతున్న మురుగు..

రెండు, మూడు దశాబ్దాల క్రితం నాసిరకంగా వేసిన డ్రెయినేజీలు కావడంతో పలుచోట్ల డ్రెయినేజీ వ్యవస్థ దెబ్బతింది.

దీంతో చెట్లు, చెదారం పెరిగి స్థానిక కాలనీల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీల్లో చెత్తను తొలగించక పోవడంతో అడపాదడపా పడుతున్న వర్షాలతో పాటు, రోజువారీగా ఇళ్లల్లో నుంచి వస్తున్న నీళ్లు పోయే మార్గం లేక రోడ్డెక్కుతున్నాయి. దీంతో బాటసారులు, దుర్గంధంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. బాపూజీనగర్‌లో అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కె.సుజాతను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


రోడ్ల పక్కన చెత్త పేరుకపోతోంది..



బాపూజీనగర్ మెయిన్ రోడ్ల పక్కన ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకపోయాయి. చెత్త తీసుకెళ్లే బండ్లు రాకపోవడంతో డంపింగ్ యార్డ్‌లను తలపిస్తోంది. చెత్తకుప్పల వల్ల గాలికి చెత్త ఇళ్లలోకి వచ్చి పడుతోంది. దీనిపై అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– మీరా, బాపూజీనగర్

డ్రెయినేజీలన్నీ దెబ్బతిన్నాయి...



కాలనీలో దశాబ్దాల నిర్మించిన డ్రెయినేజీలు కావడంతో దెబ్బతిన్నాయి. ఇటీవల కాలంలో బాపూజీనగర్‌కు అభివృద్ధి పనులేవీ రాలేదు. డ్రెయినేజీలో మురుగు తొలగించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వచ్చినప్పుడు మురుగు ఇళ్లల్లోకి వస్తోంది. అధికారులు స్పందించాలి.

– దుర్గా ప్రసాద్, బాపూజీనగర్

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంఅర్బన్: యువత సేవా కార్యక్రమాలలో ముందుండాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం విద్యానగర్ ఏరియాలో కొదుమూరి రాఘవులు తన తండ్రి రామ్మూర్తి పేరుపై చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వేసవికాలంలో బాటసారుల దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన రాఘవులను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలలో యువత ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ చింతలచెర్వు గెర్షోము, శశాంక్, క్రిస్‌బాబు, బిస్‌బాబు, వినోదిని, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ జాబ్‌మేళా నిర్వహించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థకు గుండెకాయలా పనిచేస్తున్న ప్రధాన కార్యాలయం ఉన్న కొత్తగూడెంలో సింగరేణి సంస్థ మెగాజాబ్ మేళా నిర్వహించాలని సీఐటీయూ కొత్తగూడెం బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో వేలాది మంది నిరుద్యోగులు, కార్మికుల పిల్లలు ఉన్నారు ఇక్కడ జాబ్‌మేళా నిర్వహించకుండా, అధికార పార్టీ ఎమ్మెల్యే నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహించటం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సింగరేణి సంస్థ ఒక ఐటీ హబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

జూలూరుపాడు: స్థానిక సాయి ఎక్స్‌లెంట్ విద్యాలయం, ఖమ్మం సురక్ష మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం జూలూరుపాడులో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ అందజేశారు. డాక్టర్లు తక్కలపల్లి వరుణ్, రుద్ర గౌతమ్ రమేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

24న అఖిల భారత రైతు మహాసభ

సింగరేణి(కొత్తగూడెం): దమ్మపేటలో ఈనెల 24, 25 తేదీలలో జరగనున్న అఖిల భారత రైతు మహాసభలను జయప్రదం చేయాలని, ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి, ఇటీవల కాలంలో అసువులు బాసిన నాయకులకు, కార్యకర్తలకు నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. కల్తీ విత్తనాలు నివారించాలని, ఎరువులు మార్కెట్‌లో దొరికే విధంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పార్లమెంట్‌లో చట్టం తేవాలని, కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


పోచారం తండాలో విగ్రహం ఊరేగింపు

ఇల్లెందురూరల్: బొంబాయి తండా, పోచారం తండా గ్రామాలలో ఆదివారం గ్రామదేవతల ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. బొంబాయి తండా గ్రామంలో నాభిశిల, పోచారం తండా గ్రామంలో ఆంజనేయస్వామి, నాభిశిల ప్రతిష్ఠలను ఘనంగా నిర్వహించారు. పోచారం తండా గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పలువురు యువకులు కాషాయ వస్త్రాలు ధరించి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.


బొంబాయితండా గ్రామంలో పూజ చేస్తున్న వేదపండితులు